# మాద్రి

'నేనేం చేతునే మాతల్లీ! కన్నకడుపు అని అయినా జాలిలేకుండా ఇంత కటికవాడైనాడేమి నీ తండ్రి!'

'అదేమిటి అమ్మమ్మా – నాన్న నాకోసమే...నేను సుఖపడాలనేకాదూ...చేసే యీ నిర్వాహకం!'

'హయ్యో! నిర్భాగ్యులారా...నల్లనివన్నీ నీళ్ళూ, తెల్లనివన్నీ పాలూ నీకంటికి...ఎలా బ్రతికి బట్టకడతావే.'

'ఇక, కట్టేవన్నీ బనారసుచీరలే! పెట్టిన నగ పెట్టకుండా, తొడిగిన రవిక తొడగకుండా...ఓ!... మహారాణి నౌతాను, నాకేం...తీపెళ్ళిందా?...ఎంత వైభవం?'

'...భళ్ళున తెల్లవారినట్టే ఉంది!'

'సందెపడేటప్పటికి గూట దీపం పెట్టేవారు లేరనేనా...పాపం...అతడు ఇంత తొందరపడుతూంది; మరేం, అంత ఊసు తప్పయితే, మగవాడికి కూడా విధవరికం మన శాస్త్రాల్లో వ్రాసిపెట్టించకపోయినారూ?' ఆ పిల్లదానికి భూమ్మీద అన్నోదకాలు కరవై...అది పోయిందికదా అని... ఇవతల ఈతడు అఘోరించుతూ కూర్చుండవలసినంత అవసరం ఏం వచ్చిందీ? తెల్లవారితే అప్పుడే నాలుగాయెనా... యీవారం ఏలాగో కళ్ళుమూసుకుంటే మైలస్నానం...మంగళస్నానం... రెండూ ఓమారే...

'ఏమోలే, నీ కర్మానికి...ఎవరుకర్తలు...'

'నా అదృష్టదేవతలు!...నోయాలసిన నోములకు ఫలం...అప్పుడే అడ్వాన్సుగా నాకు దక్కుతూంటే...చూసి చంకలు కొట్టుకుంటూ సంబరపడటానికి బదులు, ఏమిటి నిండిన యింట్లో కూర్చుని...ఇలా అగాయిత్యం...

'చాల్లే.. నాతోబాటు సంతోషించాలి కాని....బిక్కమొగం వేసుకుని లేనిపోని చిక్కుతెచ్చిపెట్టక... ఇంకా వ్యవధి ఉందా...యీలోపుగా మళ్ళా తలుపుదగ్గిర పాటలూ ... తలుపు గడియ పడకముందు పాడాలిసిన పాటలూ...అప్పుడు నట్టుపడకుండా...ఓమారు వల్లించుకో... '

* * *

'కృష్ణా...

'నిన్ను ఇంత చనువుగా పేరుపెట్టి పిలవలేదు...సిగ్గు విడిచి నీ యెదటపడి మాట్లాడలేదు.

'ఇప్పుడు...సిగ్గుపడి లాభంలేదు.

'నా మనసులో ఏమున్నదో నీకు అంతు చిక్కించకపోయినా...నీ మనసులో కోరికలు... ఎప్పటికప్పుడు, నీవు కిటికీదగ్గర నిలుచున్నప్పుడల్లా, నీ చూపులు నాకు తెలుపుతూనే ఉన్నవి...

'కాని, ప్రయోజనంలేదు... అందని మ్రానిపండు...అది ఎవరి దోసిలిలో రాలితే...మనకు ఒరిగేది ఏముంది... అని మనసును వెన్నగా మళ్ళించు...'

'నీకు అంతయిష్టమైతే...అవసరమైతే...నన్ను జ్ఞాపకం ఉంచుకో!'

* * *

'తాతయ్యా!...నవలల్లో చదువుతాం చూడు... పేద్దకోపం వచ్చినప్పుడు అందులో వీరుడు ఏం చేస్తాడు?–'

'పళ్ళు పటపటలాడించి జుట్టుపీక్కుంటూ'

'పాపం నీ కా యోగం లేదుకదా...ఈ వార్ధక్యంలో...ఇదే ఇంకో పాతికేళ్ళ క్రిందనైతేనా...'

'కాదులే...అప్పుడైనా నీ కాఛాన్సు వచ్చేది కాదులే... యీ సినిమాలు ముదిరిన తరువాతనేగా...నాలాటి వెర్రిపిల్లలు కళ్ళు తెరిచింది...'

'కంట నీరుపెట్టావో...నా మనసు చివుక్కుమంటుంది...నడుంకట్టుకుని పెత్తనం చేయవలసినవాడవు...జబ్బలు సవరించుకో!'

## 2

'గృహిణి వచ్చి గూట దీపం పెట్టగానే...

'మీకు–గుండె గుభీలుమనేలాగుంది అత్తా!...తెలిసినవారు, ఏలా నడవాలో తీర్చి దిద్దుకోండి...'

'తెలిసింది...నా తెలివి తెల్లవారమట్టే హాయ్యో భగవంతుడా! మావాడి బ్రతుకు చివరకు ఇలా అఘోరించిందేమా అని...నడవాలో కంట ఒత్తివేసుకుని పడిగాపులు పడి...అలకిస్తున్నా...వాడి ప్రాణానికి...'

'నేను దాపురించింది...అయన సుఖంగా ఉండటానికే కాదండీ...'

'ఈ శ్రీరంగనీతుల కేం...సందెపడగానే...ఇప్పుడున్న బుద్ధి...వాడు చెప్పలేక...చెప్ప లేక... పిచ్చపాడగట్టు...నాదగ్గిర బావురుమన్నాడు...సరి, చూద్దును గదా...నీవాలకం... ఆడజన్మ ఎత్తింది...అణిగి మణగి పడి ఉండటానికా...మగవాడిని రాచిరంపాన పెట్టడానికా... అక్కరలేనిదానవు. ..అక్కరలేనట్టుగానే ఉండలేకపోయావూ? లేక...ఏ రాజ్యాలన్నా ఏలుదామనా...యీ దిలాసా?'

'వారూ మీరూ...ఏరీ కోరీ కట్టబెట్టింది...యీ రాజ్యాన్నే కదా, ఏలడానికి! ఇంతకన్నా ఎక్కువ... ఎక్కడ మాత్రం దొరుకుతుందా?'

'ఆ జ్ఞానం ఉంటేనా...ఏలుకునేవాడు ఎంత పరితపించిపోతున్నాడో అని కనికరం నీకు ఉంటేనా?...'

'...అమ్మా!

నా జన్మకు ఇహ సుఖపడేయోగం లేదేమోనమ్మా... పెళ్ళినాడు మెడనుపడ్డ జంధ్యం... పెద్దదానితోనే పెరిగిపోయిందమ్మా... ఎన్ని ముడులు వేసినా ఏం లాభం...'

'అయ్యో నాతండ్రీ!...చూసి చూసి నీ కీ రొమ్ముల కుంపటి ఎత్తానేమిరా? ఈ శిఖండితో ఏలావేగుతావయ్యా!'

'ఏనాడు కష్టంతోస్తే...'జా పరమేశ్వరా' అని ఏ కాశో లేచిపోతాను. నా పీడ విరగడ అయిపోతుంది... పెళ్ళాం ఉన్నా...సన్యాసినే...'

'నా బొందిలో ఊపిరుండగా...నీకు వచ్చిన ఫరవా ఏమీ లేదురా. నాయనా! నీ వాకిలి ఊడ్వటానికి వచ్చిన బానిసకూతురు...నీ చెప్పుచేతల్లో పడి ఉండక ఏ చెరువునీళ్ళు త్రాగుతుందో చూస్తానుగా... మొండికి మొండే ప్రతి...నీవు లాలించినకొద్దీ దాని అగడం ఇలాగే రెచ్చిపోతుంది. నాలుగు చరిచి అన్నా లొంగదీసుకోవాలి కాని...చెల్లువంగనిది...ఇకముందు నీపాట్లు అడిగావూ... ఎద్దు నడిగి గంత కడతారటరా...ఎక్కడన్నా ఉందా ఇది...నీ యిష్టం ఇక...అంతా నీచేతులో ఉంది...'

* * *

'మంచినీళ్ళు కావాలి!'

'మీ అమ్మగారిని అడగండి.'

'ఎంతమాట అన్నావూ! మానాభిమానాలు ఏకోశానా లేవుగదా...అమ్మని అడగాలా అంట!...అయితే మరి, బొమ్మవు నీవెందుకూ...తినిపెట్టడానికా...'

'కాదు...కని పెంచడానికి తల ఒగ్గకపోతే...తినే ముద్దకూ కరువు వస్తుంది.'

'ఆ మాట ఎత్తితే...నీకు ఎక్కడలేని తలనొప్పీ...వేయిపుట్లు జ్వరమూ ముంచుకువస్తుంది...'

'అవును...నా ముఖానే ప్రొద్దుపొడిచింది...నేనూ ఓ మనిషినే...'

'నేను...మ్రాకును...అదేనా నీ వనేది...మూడు రోజులనుంచీ వళ్ళు సలసలా కాగుతూంది... ఆర్చేదిక్కు ఉంటేనా...'

'అన్నింటికీ మీకు దొరికింది...అదేవంక...ఇలా అనుక్షణం పట్టి పల్లార్చుతూంటే...ఎవతె బ్రతుకుతుంది...మీ చేతుల్లో...ఈ కడగండ్లుగడిచి...పోయిందే అదృష్టవంతురాలనుకుంటే... దానికి ప్రతిగా మళ్ళా నేను వెలశాను...వంటింట్లో కుందేలు...మన్ని తప్పించుకుపోలేదు కదా అనేకాదూ మీ చెలగాటం...'

'అలా దోవకు రా...'

'మీకు...ప్రాణంమీదన్నా ఆశలేదూ?'

'ప్రాణంమీదకన్నా కూడా...'

'అంతేనా...'

'అహో...బ్రతికిన నాలుగు గడియలూ సుఖపడకపోతే...'

'నేను ఎంత చెప్పినా...వినరు; మొరపెట్టుకున్నా ఆలకించనూ...ఇక మనకూ... పశువులకూ ఏమిటి తేడా?...'

'పదిమాట్లకు...వేయిమాట్లకు నేను పశువునే...నిన్ను చేసుకున్న తరువాత...నాకు అభిమానం ఎందుకూ? ఎంత వదరినా ఇప్పుడు నిన్ను వదిలేదిలేదు...చూద్దాం...నీ తాత ఎవరు అడ్డం వస్తాడో...పద...'

'తాతజోలి ఎందుకు లెండి...ఆ కీర్తి నేనే దక్కించుకుంటాను...'

# 3

'నాలుగు గడియల్లో ఎంత ముంచుకువచ్చిందీ...నా బంగారుతండ్రిని నీ పొట్టను పెట్టుకుంటావటే మహామారీ!...తాడకాదు...దీన్ని నిలువునా చీల్చండయ్యా తండ్రుల్లారా...మాపాలిటికి ఎక్కడ దాపురించావే...నీముఖం...'

'ఊరుకోండి అత్తా...మనమేం చేయగలము? ఆ మహారాజుకు భూమ్మీద చిట్టె డుప్ప కరువైపోయింది. పోయినవారితో మనం పోతామా...పోగలమా?...తాతయ్యా! పాపం... మావాళ్ళకు ఎంతకామాటం అనుకున్నావు? స్వంతవ్యవసాయమా...ఇచ్చిపుచ్చు కోవడాలూ... గంపంత వ్యవహారం...ఒక్కర్తే తిప్పలుపడాలి ఇక...అయినా మెలిగిన చేయికనుక ఇబ్బంది ఉండదులే...'

'ఏమనుకోమోకండమ్మ...పైత్యించి వెర్రిమాటలు వస్తున్నాయి దానికి...'

'నీవూ నీ మనుమరాలూ, కట్టకట్టుకుని గంగలో దూకండి...'

'--దూకమంటారేకాని...లోకానికి వెరవాలిసిన అవసరం మన కేముంది అత్తా! మునిగినవారు... మునగగా...ఒడ్డుకు చేరినవాళ్ళు...వంతు దీర్చుకోవద్దూ? కాదా మరి...తాతయ్యా!... సహధర్మచారిణి మరోవిధంగా నడుచుకుంటే ఆ లోకంలో ఉన్న ఆయన మనసు ఎంతో బాధపడిపోదూ?... ఆయనే మిగిలి...దైవవశాన నేనే రాలిపోయి ఉంటే...ఆ సద్బ్రాహ్మణుడు...అత్తగారూ మూడోనాటికల్లా...గుమ్మటంలాంటి పడుచును ఎక్కడనుంచో ఏరి కోరి వెదుక్కుతెచ్చుకుని గృహపావనం చేసుకునే వారేనా?

'ఉత్తమగతుల ప్రాప్తి ఆశించేదాన్నే అయితే...ఆయన అడుగుజాడల్లో మెలిగితే...నాకు ఎన్నిక ఉంది కాని...'

'అత్తయ్యా! ఉరిమిచూడబోకండి. శుభమస్తు అనడానికి బదులు నే నేమీ లోపం చేయను.

'స్వరూపాలకి భేదమే కాని...భగవంతుడు నిర్దేశించిన వైవాహికధర్మస్వరూపం మారలేదని...నా పెళ్ళినాడు...పెద్దలందరికీ మీరు నీతి ఉపదేశించినవారు కారండీ!... ఒప్పకున్నాను.

'తాతయ్యా!... మైల వెళ్ళిపోగానే మంచి ముహూర్తం ఏర్పాటుచేయి...కృష్ణుని పెండ్లికొడుకును చేయించు...కోపంతో కొరకొరలాడు...అంతే, నీపుణ్యమాయెనుకాని... పండ్లు కొరకబోకు...మళ్ళాకట్టించడం...ఇప్పుడు నాన్నకు మళ్ళా అదో అదనపు ఖర్చు.'

★ ★ ★